కార్యసాధకులు

సంపత్

నీలాకాశంలో వెండిమబ్బులు తళతళ లాడుతున్నాయి. భాస్కరుడు ఒక ప్రక్కకి ఒరిగిపోయాడు. అతనినుంచి వచ్చే కాంతిలో సముద్ర జలాలు వెండిరంగుతో మెరుస్తున్నాయి.

"స్టేట్ ఆఫ్ హర్యానా" డెక్ మీద నిలబడి ప్రకృతిని తిలకిస్తూ ఆత్మానందాన్ని అనుభవిస్తున్నాడు ముఖర్జీ. అతడు అజానుబాహుడు. బలిష్టమైన దేహం. ఒత్తుగానున్న జుట్టు, అక్కడక్కడ తెల్లటి వెంట్రుకలు. చిన్న కళ్ళు. సన్నని మీసాలు. కొద్దిగా లావుగావున్న పెదాలు, నల్లగా ఉన్నాయి. సముద్రంమీదనుంచి వచ్చే గాలికి జుట్టు ఎగిరెగిరి పడుతోంది.

ఆ డెక్ పై అతనిలాగే చాలామంది నిలబడి మాట్లాడు కొంటున్నారు. ఎవరి ధోరణిలో వారున్నారు. నవ్వుతూ, తుళ్ళుతూ హుషారుగా ఉంది వాతావరణం అక్కడ. మరో ఇరవై నాలుగు గంటలలో అది పోర్ట్ బ్లెయిర్ చేర బోతూంది.

ముఖర్జీ తల తిప్పి చుట్టూ చూశాడు. కొద్ది దూరంలో మరో వ్యక్తి అతని కళ్ళబడ్డాడు. అతనుకూడా ముఖర్జీలాగే బలమైన శరీరం గలవాడు. ఐతే ముఖర్జీకంటే ఎత్తు తక్కువ. నవ్వుతూ ఉన్న కళ్ళు. ముఖర్జీ చూపు తనమీద పడగానే కళ్ళతోనే ఏదో సైగచేశాడు.

తరువాత కొద్దిసేపటికి ముఖర్జీ డెక్ పైనుంచి తన కాబిన్ లోకి నడిచాడు. మరో అయిదునిమిషాల తరువాత ఒక్కొక్కరుగా ముగ్గురు వ్యక్తులు ముఖర్జీ కాబిన్ లోకి ప్రవేశించారు. వారిలో ఇందాక ముఖర్జీ వంక చూసి సైగచేసిన వ్యక్తికూడా ఉన్నాడు.

ముగ్గురు రాగానే, ముఖర్జీ లేచి కాబిన్ తలుపు బంధించాడు. "గుడ్ మార్నింగ్!" అని చెప్పటం మొదలు పెట్టాడు ముఖర్జీ.

'ఫ్రెండ్స్! కొద్దిగంటలలో ఈ నౌక పోర్ట్ బ్లెయిర్ ని సమీపించబోతూంది. మనం గమ్యస్థానాన్ని సమీపించాము. ఇంతవరకు మనగురించి అతి రహస్యంగా ఉంచబడింది. చివరికి మనంకూడా ఒకరినొకరు ఎరగనట్లే ప్రవర్తించాము.

సరే! మరోసారి ఏం చెయ్యాలో గుర్తుకు తెచ్చుకోండి. ఈ షిప్ కెప్టెన్ కు తప్ప ఇతరులకు మనం ఎవరమో తెలియదు. ఈ రాత్రికే మనం యిక్కడనుంచి తప్పించుకోవాలి. మీ మీ సామానులు సరుకొని సిదంగా ఉండండి.

ఒక్కటి మాత్రం గుర్తుంచుకోండి. మన ధ్యేయం ఒక్కటే. ఎలాగైనా ఆ స్థావరం నాశనం కావాలి. మన ప్రాణాలు పోయినా సరే, వెనుదీయకూడదు. సందర్భానుసారం, సమయస్ఫూర్తితో వ్యవహరించండి. విష్ యు గుడ్ లక్. జైహింద్!''

అన్నాడు ముఖర్జీ. అందరూ మౌనంగా ఉండిపోయారు కొద్దిసేపు. తరవాత కొద్దిసేపు ఏమేం చేయాలో చర్చించుకున్నారు. కైలాష్, సాగర్, రాజులు వెళ్ళిపోగానే ముఖర్జీ తలుపు బిగించి జేబులోనుంచి పెన్ తీశాడు. పైనున్న కాప్ తీసి అడుగున అమర్చి పైభాగాన ఉన్న చిన్న బుడిపెను నొక్కాడు. పైభాగంలో సన్నటి ఏరియల్ పైకి వచ్చింది.

ఎవరికో ఏదో చెప్పసాగాడు ఆ వైర్‌లెస్ ట్రాన్స్‌మిటర్‌లో. అదే సమయంలో డెక్ మీద కలకలం వినిపించింది. చెప్పటం ముగించి, పెన్‌ని యథాప్రకారం మూసి డెక్ మీదకు నడిచాడు.

డెక్ మీద ఉన్న మనుషులు ఆందోళనగా ఆకాశంలోకి చూస్తున్నారు. ముఖర్జీ కూడా మౌనంగా అందరినోమారు పరిశీలించి, తానూ ఆకాశంవైపు చూశాడు. మిగిలినవారు కూడా చూస్తున్నారు.

దూరంగా ఉత్తరదిశనుంచి ఐదువిమానాలు దూసుకొస్తున్నాయి. వాటిని చూడగానే ముఖర్జీకి అర్థం ఐంది కలకలానికి కారణం. జనం అంతా ప్రాణాలుగ్గబట్టుకొని వాటివంకే చూస్తున్నారు తదేకంగా. విమానాలు సమీపించాయి. జెట్ బాంబర్స్. అవి దగ్గరయ్యేకొలది షిప్ మీద సంచలనం ఎక్కువైంది. కొంతమందికి ఏదు

పొక్కలేటే తప్పక. మరికొంతమంది కాబిన్‌లలోకి పరుగెత్తారు.

ఆ జనంలోనే కలిసిపోయి ఉన్న ముఖర్జీ అనుచరులు ఒకరివంక ఒకరు చూసుకున్నారు అయోమయంగా. ఎక్కడినుంచి ఆ విమానాలు వస్తున్నాయో అర్థంగాలేదు వారికి. వారికి అర్థం అయ్యిందల్లా ఒకటే!

ఏదో హార్బరునో, ఫ్యాక్టరీనో, మరేదో ముఖ్యమైన స్థావరాన్ని ధ్వంసంచేసి వస్తున్నాయని.

విమానాలు ఇప్పుడు షిప్ మీద ఎగురుతున్నాయి. షిప్‌ని గమనించాయి కాబోలు. రెండు, మూడు రౌండ్లు షిప్ చుట్టు తిరిగాయి. అవి తిరుగుతున్నంతసేపు ప్రాణాలుగ్గబట్టుకొని చూశారు ప్రజలు.

పదినిముషా లనంతరం అవి షిప్‌ని వదిలి తూర్పుగా ఎగిరి మాయం ఐపోయాయి.

జనం అంతా హాయిగా ఊపిరి పీల్చుకున్నారు, పెద్ద గండం గడిచినట్లు. వారలా భయపడటంలో వింత ఏమీ లేదు. దానికి కారణం ఉంది.

2

సుమారు నెలరోజుల క్రితం కొన్ని యుద్ధవిమానాలు హఠాత్తుగా దాడిచేశాయి భారతదేశపు నౌకలమీద. రాడార్‌లు వాటిని పసిగట్టి హెచ్చరించే లోపునే జరగవలసిన అనర్థం జరిగిపోయింది.

హఠాత్తుగా మెరుపులా ప్రత్యక్షం అయి, నాశనం చేసి కన్నుమూసి తెరిచేంతలో మాయం అయిపోయాయి.

ఆ విమానాలు ఎవరివో తెలియదు. ఏ గుర్తులూ దాని మీద లేవు. భారతదేశంమీద పగ ఉన్న ఇతరదేశం ఏదైనా ఈ పనికి పూనుకుందా అని ఆలోచిస్తే అదీకాదని

తేలిపోయింది. ఇటువంటి విమానాలే సింగపూర్, మలయాల మీదుగాకూడా వెళ్ళి నాశనం చేశాయని వార్తలు వచ్చాయి. చైనాకూడా తన తీరంమీద దాడి జరిగిందని, అది భారతదేశమే చేసిందని గోలపెట్టింది. ఇటువంటి పరిస్థితులలో అయోమయంలో పడిపోయింది భారతదేశం.

ఆ విమానాలను వెంటాడుతూ వెళ్ళిన ఏ విమానము తిరిగి రాలేదు. కనీసం వారినుంచి జవాబుకూడా రాలేదు. ఏ వివరమూ తెలియని పరిస్థితిలో ఒక కొత్త వార్త చేరింది భారతదేశానికి.

అండమాన్ దీవుల సమీపంలో ఒకటి రెండు జలాంతర్గత నౌకలు సంచరిస్తున్నట్లు వార్త. ఆ నౌకలమీద కూడా ఏ విధమైన గుర్తులు లేవని తెలిసేటప్పటికి భారతదేశంకి కొంత అర్థం అయ్యింది. బహుశా ఆ సబ్ మెరీన్లు కూడా ఆ విమానాలు సంబంధించిన దేశానికే చెంది ఉంటాయని అభిప్రాయపడింది.

ఇది ఇలా ఉండగా దేశదేశాలకు సంబంధించిన సైంటిస్టులు ఒక్కుమ్మడిగా మాయం ఐపోసాగారు. వారినందరిని దొంగిలించి ఆ బేస్‌లోకే చేర్చారని వదంతి. కాని దానిలోని నిజానిజాలు తెలియవు.

మొత్తంమీద ఏదో ప్రమాదం రానున్నదని గ్రహించింది ఇండియా.

వెంటనే భారతదేశం రంగంలోకి దిగింది. అతి రహస్యంగా, త్వరితంగా వివరాలు సేకరించింది.

ఫలితమే మిలటరీ అధికారులయిన సాగర్, కైలాష్, రాజు, ముఖర్జీల ప్రయాణం. సర్వహంగులతో, రహస్యంగా వారి ప్రయాణం ప్రారంభమయింది.

రాత్రి పదకొండుగంటలు దాటినతర్వాత, జాగ్రత్తగా, రహస్యంగా డెక్ పైకి వచ్చారు ముఖర్జీ బృందం. అంతకు ముందే లైఫ్‌బోట్లు తీసి రెడీగా ఉంచబడి వున్నాయి. వాటిని జాగ్రత్తగా, శబ్దం కాకుండా నీటిలోకి జార విడిచారు.

అవసరమయిన సామానులన్నీ వాటర్ ప్రూఫ్ బాక్స్‌లో ఉన్నాయి. వాటిని బోట్స్‌లోకి దించారు. "తాడు నిచ్చెన" ద్వార బోట్లలోకి దిగారు. కెప్టెన్‌కి వీడ్కోలు చెప్పి బోట్లను నడపటం ప్రారంభించారు. తాడు పైకి లాక్కుని ఏమీ ఎరగనట్లు వెళ్ళిపోయాడు కెప్టెన్.

స్టేట్ ఆఫ్ హర్యానా ముందుకు దూసుకుపోతూంది. లైఫ్‌బోట్లలో మిగిలిపోయింది ముఖర్జీ బృందం. చుట్టూ అంతులేని చీకటి. ఆకాశంలో చిన్న మబ్బు కూడా లేదు. నక్షత్రాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. దూరంగా నౌక దీపాలు.

టార్చి వెలిగించి కంపాస్ చూశాడు ముఖర్జీ. ఏ దిక్కుగా పోవాలో చెప్పాడు. తెడ్లతో బోట్లను నడపటం ప్రారంభించారు.

సముద్రం మీదనుంచి వీచే చలిగాలి వణుకు పుట్టిస్తోంది. గాలి హోరులో మాటలుకూడా విన్పించటంలేదు. పెద్దగా మాటాడుకుంటూ, వంతుల వారీగా బోట్లనునడుపుతున్నారు.

రాత్రి రెండున్నర గంటల ప్రాంతాలలో ఒక దీవి తగిలింది.

అక్కడ విశ్రాంతి తీసుకుందాం అన్నాడు కైలాష్,

మిగిలినవాళ్ళు కూడా అలసిపోయి ఉండటంవల్ల అంగీకరించి, బోట్లను దీవికేసి నడిపారు.

బోట్లను తీరంమీదికి చేర్చారు. ఆ దీవి అంతా చెట్లమయంలా ఉంది. రకరకాలైన చెట్లు దట్టంగా వున్నాయి. టార్చిలైట్లు వెల్గించి చూశారు.

"జాగ్రత్త! విషపురుగు లుంటాయి!" హెచ్చరించాడు ముఖర్జీ. అందరూ కలిసి బోట్లను చెట్లమధ్యకు లాగి ఆకులతో కప్పేశారు. "తెల్లవార వస్తున్నది. పగలు ఇక్కడే ఉండిపోదాం" అన్నాడు ముఖర్జీ. కాపలాగా సాగర్‌ను ఏర్పాటుచేసి మిగిలినవాళ్ళు మంచి చోటు చూసుకొని నిద్రకుపక్రమించారు. వెంటనే నిద్రపట్టింది వారికి.

సాగర్ కాపలాగా కూర్చున్నాడు. అతని చేతిలో చిన్న మెషిన్‌గన్, టార్చ్‌లైటు వున్నాయి. ఏ చిన్న శబ్దం అయినా పరీక్షించి చూస్తున్నాడు.

అరగంట హాయిగా గడిచింది.

చిన్నగా ఉలిక్కిపడ్డాడు సాగర్. అతని పాము చెవులు ఏదో శబ్దాన్ని పసిగట్టాయి. చెవులు రిక్కించి, మరింత జాగ్రత్తగా విన్నాడు. ఏదో శబ్దం. మోటారు బోట్‌దై వుండాలని భావించాడు. ఎటునుంచి వస్తుందో తెలియడం లేదు. లీలగా విన్పిస్తోంది. గాలిద్వారా.

'ఒకసారి చూసి వస్తే!' అనుకున్నాడు తనలో తను. కాని మిగిలినవాళ్ళను ఒంటరిగా వదిలివెళ్ళటం ఇష్టంలేదు. వారివైపు ఓసారి చూశాడు. నిశ్చింతగా నిద్రపోతున్నారు

ఏదో నిశ్చయానికి వచ్చి, మెషిన్‌గన్ పొజిషన్‌లో పట్టుకుని, టార్చ్‌లైటు వెల్గించకుండా తీరంవైపు నడిచాడు. మెత్తటి ఇసకలో కాళ్ళు కూరుకుపోతున్నాయి. హోరుమని గాలి, సముద్రపు ఘోష. ఆ గాలి వెంటే వస్తూంది

శబ్దం. ఒకసారి చుట్టూ పరికించి శబ్దం వస్తున్న వైపుగా అడుగులు వేయసాగాడు.

చలిగాలి రివ్వున కొడుతూంది. వంటినిండా ఉన్ని దుస్తులు, కాళ్ళకు సాక్స్, బూట్స్, చేతులకు గ్లవ్స్ ఉండటంవల్ల అంతగా ప్రమాదంలేదు గాలివల్ల.

తీరం వెంట పోయేకొద్ది శబ్దం ఎక్కువ కాసాగింది. ఇప్పుడా శబ్దం స్పష్టంగా విన్పిస్తోంది.

హెలికాప్టర్!

ఆశ్చర్యపోయాడు సాగర్. ఈ నిర్జన దీవిలో, రాత్రి పూట హెలికాప్టర్ ఎలా వచ్చింది? ఒకవేళ ఇదే తాము అనుకుంటున్న శత్రువుల స్థావరం కాదుగదా! ఈ ఆలోచన తట్టడంతోనే మరింత జాగ్రత్తగా ఉండాలని తీర్మానించుకుని, చుట్టూ మరోమారు పరికించాడు. వాతావరణంలో మార్పులేదు.

మరికొంత దూరం నడిచాడు. శబ్దం దగ్గరయింది. చటుక్కున నేలమీద బోర్లా పడుకున్నాడు. తల పైకెత్తి చూశాడు. దీవి మీదుగా ఎగురుకుంటూ వెళ్ళిపోయిందో హెలికాప్టర్. దాని అడుగున రంగురంగుల దీపాలు ఆరుతూ, వెలుగుతూ ఏవో సిగ్నల్స్ ఇస్తున్నాయ్.

దీవిమీద ఉన్న చెట్లమీదుగా ఎగురుకుంటూ వెళ్ళిపోయింది. పైకి లేచి నిలబడ్డాడు అయిదు నిమిషాల తర్వాత. వెనక్కు తిరిగి నడవటం ప్రారంభించాడు. అప్పుడు సమయం తెల్లవారుజాము నాలుగుగంటలు దాటింది.

తిరిగి వస్తుండగా ఎదురుగా ఎవరో కదులుతున్నట్లు లీలగా తోచి, మెషిన్‌గన్ ఎక్కుపెట్టాడు. లైటు వెలిగించలేదు. ఊపిరి బిగించి రెండు నిముషాలు ఆ ఆకారం వంకే చూస్తూ నిలబడ్డాడు.

అవతలి ఆకారం కూడా ఆగిపోయింది. సాగర్ చేతి వేళ్ళు ట్రిగ్గర్ మీద బిగుసుకున్నాయి.

రెండు నిమిషాలపాటు అలానే ఉండిపోయారిద్దరు.

"సాగర్!" అంది అవతలి ఆకారం.

గన్ దించాడు సాగర్, "కైలాష్" అంటూ వెంటనే టార్చిలైటు ఫోకస్ కైలాష్‌మీద వేసి ఆర్పేశాడు.

ఇద్దరూ దగ్గరయ్యారు.

"ఏదో శబ్దం విన్పించి లేచాము. నువ్వు లేవు. హెలికాప్టర్ ఏదో వెళ్తున్న శబ్దం విని ఆశ్చర్యపడ్డాము" చెప్పాడు కైలాష్.

"అవును" అంటూ జరిగిన విషయం అంతా చెప్పాడు సాగర్. ఇద్దరూ మౌనంగా తమ మిత్రుల దగ్గరకు బయలుదేరారు.

మిగిలిన ఇద్దరు కూడా దారిలోనే ఎదురయ్యారు గన్స్‌తో. సాగర్ చెప్పింది విని "ఇదంతా చూస్తుంటె మనం గమ్యం చేరామని అనిపిస్తోంది" అన్నాడు ముఖర్జీ.

నిద్రమత్తు వదిలిపోయింది అందరికి. కర్తవ్యాన్ని ఆలోచిస్తూ, తమ వెంట తెచ్చిన ఫుడ్ పాకెట్స్ విప్పసాగారు.

4

తెల్లవారుఝాము అయిదున్నర గంటలయింది. తూర్పు అప్పుడే ఎర్రబారుతోంది. దీవిలోని చెట్లు, అస్పష్టంగా కన్పిస్తున్నాయి.

"ఒకసారి దీవి అంతా చుట్టివస్తే బాగుంటుంది!" సూచించాడు రాజు.

"చూసి రావచ్చు. కాని మనం పట్టుబడకూడదు. ఇక్కడ ఎంతమంది ఉన్నారో, వారి దగ్గరున్న ఆయుధా

లేమిటో తెలియకుండా ముందుకుపోవటం మంచిది కాదు"
తన అభిప్రాయాన్ని చెప్పాడు ముఖర్జీ.

పావుగంట తర్జన భర్జన లనంతరం ఒక నిర్ణయానికి వచ్చారు నలుగురూ. సాగర్, కైలాష్లు ఒక జట్టుగా, ముఖర్జీ, రాజులు మరో జట్టుగా బయలుదేరటానికి నిశ్చయించుకున్నారు. అందువల్ల నలుగురూ ఒకేసారి పట్టుబడే అవకాశం వుండదు.

మరో అయిదు నిమిషాల తర్వాత రాజు, ముఖర్జీలు వెళ్ళిపోయారు. చెట్లచాటున నక్కుతూ హెలికాప్టర్ వెళ్ళిన దిశగా వెళ్ళిపోయా రిద్దరూ.

సాగర్ తన చేతిలో వున్న రివాల్వర్తో చెట్లవైపు, ఆకులవైపు గురిచూస్తున్నాడు, ప్రేల్చకుండా. కైలాష్ తన కిట్ తెరిచి తన సామానులు సర్దుకుంటున్నాడు.

సాగర్ టైం చూసుకున్నాడు. ముఖర్జీ, రాజులు వెళ్ళి ఇరవై నిముషాలు అయ్యింది. జేబులోనుంచి అగ్గిపెట్టె సైజులో ఉన్న చిన్న వైర్లెస్ సెట్ తీశాడు. ఒక స్విచ్ నొక్కి, ఏదో చేశాడు. అరనిముషం తర్వాత రిప్లై వచ్చింది. అగ్గిపెట్టెమీద వెలుగుతున్న ఎర్రలైటు ఆరిపోయి, పచ్చలైటు వెల్గింది సంకేతంగా.

ముఖర్జీ మాట్లాడుతున్నాడు. తాము వారి స్థావరాన్ని సమీపించినట్లు అనుమానంగా వుందని, ఇంతవరకు శత్రువుల జాడ కన్పించలేదని చెప్పాడు.

మరో పదినిముషాల అనంతరం సాగర్, కైలాష్లు బయలుదేరారు. బాగా తెల్లవారింది. వేసవిరోజులు. మంచు పట్టుకుంది కొద్దిగా. చేతిలో రివాల్వర్, వెనక వీపున కిట్, తలపైన ఉక్కుటోపి. ఇద్దరూ ముందుకుసాగి

పోతున్నారు. ఎండిన ఆకులమీద కాలుపడి శబ్దం కాకుండా జాగ్రత్తగా నడుస్తున్నారిద్దరూ. మధ్యలో ముఖర్జీని కాంటాక్ట్ చేయటానికి ప్రయత్నించి విఫలుడయ్యాడు సాగర్.

దాదాపు అరగంట ప్రయాణం అనంతరం ఇద్దరూ ఆగారు. కొద్దిదూరంలో ఎత్తయిన గుట్ట వుంది. గుట్ట పైభాగాన ఇద్దరు వ్యక్తులు బోర్లాగ పడుకొని అటువైపు చూస్తున్నారేదో. ఆ ఇద్దరూ ముఖర్జీ, రాజులని తెల్సిపోతోంది.

సాగర్, కైలాష్‌లు మెల్లిగా గుట్ట ఎక్కడం ప్రారంభించారు. ముఖర్జీ దగ్గరకు నడిచినప్పటికి వారిద్దరు తల తిప్పి చూడలేదు.

కైలాష్‌కు ఏదో అనుమానం వచ్చింది. వారిద్దరి దగ్గరకు నడిచాడు. అంతే!

నోటమ్మట మాటలేకుండా నిల్చుండిపోయాడు.

గుట్టమీద బోర్లాగా వున్న ముఖర్జీ, రాజులలో ప్రాణం లేదు.

కళ్ళప్పగించి చూస్తుండిపోయారు సాగర్, కైలాష్‌లు. వారి చేతులు ఆటోమేటిక్‌గా రివాల్వర్‌లమీద బిగుసుకుపోయాయి.

చెట్లచాటునుంచి పన్నెండు, పదిహేనుమంది వ్యక్తులు మెషిన్‌గన్స్‌తో చుట్టూ కమ్ముకోవటం చూసి అదిరిపడ్డారిద్దరూ. అందరూ సైనికుల దుస్తులలో ఉన్నారు. ప్రతివాడి చేతిలోని గన్ ఆవురావురుమంటూ సాగర్, కైలాష్ వైపు చూస్తున్నాయి.

సాగర్, కైలాష్‌లు రివాల్వర్‌లు క్రిందపడేసి చేతులెత్తి నిలబడ్డారు.

5

అది భూమిలోపల నిర్మించబడిన విశాలమైన హాలు. ఆ హాలుకి ఒక చివర బోనులువంటి సెల్స్ అయిదు వున్నాయి. రెండు సెల్స్‌లో ఎవరో ఉన్నారు. కాని స్పృహలో లేరు. వాళ్ళంతా గాయాలతో మూలుగుతున్నారు.

"బోనులో చిక్కాం!" అన్నాడు కైలాష్, బోను కటకటాలు పట్టుకొని చూస్తూ. అక్కడ కాపలాగా ఎవరూ లేరు. మిలటరీ దుస్తులు ధరించి వున్న కొంతమంది మనుషులు అటూ ఇటూ తిరుగుతున్నారు. హాలులో అటు, ఇటు రెండు తలుపులు వున్నాయి. వాటిద్వారా తిరుగుతున్నారు, వారి దుస్తులను చూడగానే "చైనా" దేశస్థులని గ్రహించారు సాగర్, కైలాష్‌లు. లోపలనుంచి ఏదో మిషన్ల చప్పుడు విన్పిస్తోంది.

హాలులో వున్న సెల్స్ చూడగానే తమను వెంటనే ఎందుకు చంపలేదో గ్రహించాడు కైలాష్. పై అధికారుల నుంచి ఆర్డర్స్ రానిదే తమనేమీ చేయలేరు.

ముఖర్జీ, రాజులు గుర్తుకు వచ్చారు హఠాత్తుగా. కళ్ళల్లో నీరు తిరిగింది లీలగా. మనస్సుని సమాధాన పరచుకొని, టైం చూసుకున్నాడు. తెల్లవారి ఎనిమిది గంటలవుతోంది.

ఇంతలో ఇద్దరు సైనికులు వచ్చి నిలచారు. ఒకడు హాలు గోడకు అమర్చబడి వున్న స్విచ్‌బోర్డులో ఒక స్విచ్ నొక్కాడు. బోనుకు వున్న ఒక తలుపు తెరచుకుంది.

"చేతులు ఎత్తి నడవండి!" ఇంగ్లీషులో హెచ్చరించాడొక సైనికుడు. ఆ ఇద్దరి చేతుల్లో మెషిన్‌గన్స్ సాగర్, కైలాష్‌లకు గురిపెట్టబడి వున్నాయి. ఏమాత్రం కదిలినా

ఒళ్ళంతా తూట్లుపడటం ఖాయం. అంతకుముందే వారి దగ్గరున్న సమస్తం తనిఖీచేసి లాక్కున్నాడు.

సాగర్, కైలాష్‌లు బయలుదేరారు. హాలు రెండోవైపు వున్న ద్వారంవద్దకు నడిచారు సైనికుల ఆజ్ఞపై. ఆ గది తలుపులు తెరిచి నలుగురు లోనికి ప్రవేశించారు.

అదొక లిఫ్ట్ అని గ్రహించాడు సాగర్. మెషిన్‌గన్స్ డొక్కల్లో గుచ్చుకుంటున్నాయి. సాగర్, కైలాష్ లిద్దరూ ఎదురెదురుగా నిలబడి వున్నారు. లిఫ్ట్ క్రిందకు బయలుదేరింది. కళ్ళతోనే కైలాష్‌ని హెచ్చరించాడు సాగర్. బూటుకాలితో అడుగున టర్‌టర్‌మని మూడు సార్లు కొట్టాడు. సైనికులకు అనుమానం వచ్చింది. కాని అప్పటికే సమయం మించిపోయింది.

సాగర్, కైలాష్‌లు చటుక్కున కూర్చొని, సైనికుల కాళ్ళను పట్టుకొని గుంజారు. సైనికులు క్రిందపడ్డారు. పదినిముషాల తర్వాత లిఫ్ట్ క్రిందకు దిగి ఆగిపోయింది.

లిఫ్ట్ తలుపు తెరిచి తొంగి చూశాడు సాగర్. వెడల్పుగా వుంది నడవా. ఒక చివర ఏదో తలుపు వుంది. రెండో చివర నడవా రెండు భాగాలుగా చీలిపోయింది.

బయటకు నడిచాడు సాగర్. అతనిప్పుడు 'కైనా' సైనిక దుస్తులలో ఉన్నాడు. నిజానికి ఆ డ్రస్ సాగర్‌కు ఫిట్ ఐంది. ఐనా పరీక్షగా చూస్తే తప్ప కనుగొనలేరు.

నడవా చివరకు నడిచి తలుపు తెరిచి చూశాడు. అదొక స్టోర్ రూంలా ఉంది. తాళం లేకపోవడంవల్ల బహుశా అది ఉపయోగంలో లేదేమోనని భావించాడు సాగర్. సైనికుల శవాలను ఆ రూంలోనే సామానుల మాటున పడేశారు.

బయటకు నడిచి, తలుపు మూసి బయలుదేరారు. ఇంతలో హఠాత్తుగా ప్రక్కనే ఉన్న తలుపు తెరుచు కుంది. ఉలిక్కిపడ్డారు ఇద్దరు. తలుపు తెరుచుకొని, లిఫ్ట్‌లోనుంచి ఒక సైనికుడు దిగాడు. సాగర్, కైలాష్ వంక పరీక్షగా చూడబోయాడు. అది గమనించి సాగర్ త్వరితంగా నడిచి, లిఫ్ట్‌లోకి చేరి తలుపు వేసుకున్నాడు. లిఫ్ట్ స్విచ్ నొక్కగానే పైకి లేచింది. దాన్ని మధ్యలోనే ఆపాడు. రెండు నిమిషాలు అలానే ఉండిపోయారిద్దరూ.

తరవాత మరలా క్రిందకు దిగారు. సైనికుడు లేడక్కడ. ఇద్దరు ఒకరినొకరు చూసుకొని నవ్వుకున్నారు. నడవా చీలిన చోటకు రాగానే ఎటు వెళ్లాలన్న ప్రశ్న ఉత్పన్న మైంది. చివరకు రెండువైపులకు పోయి చూసి రావాలని తీర్మానించుకున్నారు.

ఎడమవైపుగా ఉన్న నడవావెంట నడిచారు. తలుపు వేసి ఉంది. కొద్దిగా తెరిచిచూశాడు సాగర్. అది డైనింగ్ హాలులా ఉంది. ట్రేలలో పదార్థాలను పెట్టుకొని బట్లర్లు అటూ యిటూ తిరుగుతున్నారు. డైనింగ్ హాలులో ఎవరూ సైనికులు లేరు. రెండు నిమిషాలు అలానే చూసి, కైలాష్ వంక చూసి, నవ్వి అన్నాడు.

"ఒక చిన్న గమ్మత్తు చేస్తాను. చూడు!"

కైలాష్ వారించబోయాడు. కాని సాగర్ తలుపు తెరుచుకొని లోన జొరబడటం జరిగిపోయింది. తాను కూడా లోనికిపోయాడు కైలాష్.

సాగర్ ముందుకు నడిచి డైనింగ్ టేబుల్ వద్ద ఖాళీగా ఉన్న ఒక కుర్చీలో కూలబడ్డాడు. అతని ప్రక్కనే ఉన్నాడు కైలాష్. అతనికి లోలోపల భయంగానూ,

సాగర్ మీద కోపంగానూ ఉంది. సాగర్ ఎప్పుడూ అంతేనని అతనికి తెలుసు. ధైర్యంగా ముందుకు దూసుకు పోతాడు. తలమీద నున్న మెటల్ హెల్మెట్ ని తీయలేదు.

ఒక బట్లర్ వారివద్దకు వచ్చాడు. చైనాభాషలో ఏదో చెప్పాడు సాగర్. ఆ బృందంలో ముఖర్జీ, సాగర్ లకు మాత్రమే చైనాభాష వచ్చు.

బట్లర్ వారివైపు అనుమానంగా చూస్తూ ట్రేలో పదార్థాలు తెచ్చాడు. సాగర్ గద్దించేసరికి అతను అక్కడ నుండి తప్పుకున్నాడు. ఇద్దరూ తృప్తిగా ఫలహారాలను పూర్తి చేశారు. వేడి టీ తాగి ఇద్దరూ బయటకు నడిచారు.

"ఎలా ఉంది?" అడిగాడు సాగర్.

"నా తలకాయలా ఉంది. మనిద్దరిని గమనించారు. ఐనా నీకెంత ధైర్యం?"

"ఇందులో ఏంలేదు. ఈ బట్లర్ లని చూశావు గదా. బలవంతంగా పని చేస్తున్నట్లు వాళ్ళ మొహాలు చూస్తేనే తెలుస్తూంది. నేను అప్పుడే ఊహించాను. వీరి కిష్టంలేని పనుల్ని బలవంతంగా చేయిస్తున్నారు. అందుకే గద్దించే సరికి భయపడిపోయాడు. బహుశా కొత్తగా చేరి వుంటాడు."

ఇద్దరూ నడవా రెండోవైపు నడిచారు. నడవా చివర ఒక ఉక్కుతలుపు ఉంది. దాన్ని తెరవటానికి స్విచ్ కూడా దాపుల్లో కన్పించలేదు.

సామాన్యంగా అండర్ గ్రౌండ్స్ లో తలుపులప్రక్కనే స్విచెస్ ఉంటాయి. కాని ఈ తలుపుకి లేకపోవటంతో అనుమానం వచ్చింది సాగర్ కి. "ఈ తలుపు చాలా ముఖ్యమైంది ఐవుండాలి" అన్నాడు కైలాష్ తో. గోడప్రక్కనే

తడిమాడు. రెండు, మూడు నిమిషాల తర్వాత గోడమీద అతి చిన్న బొడిపె కన్పించింది. దాన్ని నొక్కగానే తలుపు పైభాగాన అరచేయి వెడల్పున ఉండే తలుపు తెరుచుకుంది. లోపలనుంచి ఆటోమాటిక్‌గా ఏదో బయటకు వచ్చింది.

అదేమిటో గ్రహించే లోపునే జరగవలసిన అనర్థం జరిగిపోయింది. టెలివిజన్ కెమెరా లెన్సు అది. సాగర్, కైలాష్‌లు టెలివిజన్‌లోకి ఎక్కారు.

6

అండర్ గ్రౌండ్‌లో ఉన్న కంట్రోలు రూంలో రకరకాల మిషన్‌లు, వ్యక్తులు హడావిడిగా ఉన్నారు. ఆపాదమస్తకం నల్లటి, ఎర్రటి మొదలైన రంగుల దుస్తులు ధరించిన వ్యక్తులు కంప్యూటర్‌ల ముందు, ఇతర పరికరాల ముందు కూర్చుని పనులలో మునిగిపోయి ఉన్నారు. వారి ముఖాలకున్న మాస్క్‌లకు కళ్ళదగ్గర మాత్రం రెండు చిన్న కంతలున్నాయి. అందరి చేతులకు గ్లవ్సు, కాళ్ళకు రబ్బరు బూట్లున్నాయి.

ఆ హాలులో ఎన్నోరకాల మెషిన్‌లు, కంప్యూటర్‌లు ఉన్నాయి. రంగురంగుల బల్బులు వెలుగుతూ ఆరుతూ అదొక గమ్మత్తయిన లోకంలా ఉంది.

ఆ హాలులో అన్ని పరికరాలు పనిచేస్తున్నప్పటికి, మొత్తంహాలు మూడుభాగాలుగా విభజింపబడి ఉంది. ఒకభాగం దీవి బయట శత్రువుల ఉనికిని కనిపెట్టడానికి అవసరమైన టెలివిజన్ సెట్స్, ఇతర పరికరాలను కలిగి ఉంది. మరోభాగం అండర్‌గ్రౌండ్ లోపల నిర్వహణను చూస్తుంది. మూడోభాగం చాలా ముఖ్యమైనది.

ప్రతివారి ముందు టెలివిజన్ సెట్స్ ఉన్నాయి. వాటి ద్వార దీవి లోపల, బయట ఏమేమి జరుగుతుందో తెలుస్తూంది.

హాలులో ఉన్న మూడో భాగం ఆధ్వర్యంలో ఒక గని తవ్వకం జరుగుతున్నట్లు టెలివిజన్ సెట్స్‌లో కన్పిస్తూంది. కొంతమంది వ్యక్తులు గనిలో ఏదో పదార్థపు లోహాన్ని తవ్వి తీసుకెళ్తున్నట్లు కన్పిస్తున్నదానినిబట్టి గమనించవచ్చు. ఆ గనిలో తవ్విన ఖనిజాన్ని అండర్ గ్రౌండ్‌లోనే సముద్రంలో నిర్మించబడిన పొడవైన సొరంగం ద్వారా 'కేబుల్ కార్' వంటి దానిలో పంపుతున్నారు. దాని మరో దీవిలోనివారు సంగ్రహించి ఆ ఖనిజంనుండి రేడియంలాంటి అణుధార్మిక పదార్థాన్ని తీస్తారు. దానిని అణుబాంబులు మొదలైనవాటిని తయారుచేయటాని కుపయోగిస్తున్నారు.

ఒక కంప్యూటర్ ముందు కూర్చొని చూస్తున్న ఒక వ్యక్తి ఎర్రటి బల్బు వెలగటంతో అలవాటుగా టెలివిజన్ సెట్‌లోకి చూసి స్విచ్ నొక్కాడు. కాని వెంటనే ఏదో అనుమానం వచ్చింది. మరుక్షణం మరో బటన్ నొక్కాడు. అంతకుముందు టెలివిజన్‌లో కన్పించిన వ్యక్తులు కన్పించలేదు. ఇంతలోనే ఏమయ్యారు? అసలెవరు వీళ్లు? ఎలా జొరబడ్డారు లోనికి?

మరుక్షణమే అలారం సైరెన్ "బొంయ్" మంది. మరుక్షణమే ఆ అండర్ గ్రౌండ్‌లో కలకలం హెచ్చింది. సైనికులు ఉరుకులు, పరుగులమీద వచ్చి వాలుతున్నారు. ఎక్కడివారి నక్కడే ఆపేసి చెక్ చేస్తున్నారు.

ఇంత హడావుడి జరగటానికి కారణం సాగర్,

కైలాష్ అని వేరే చెప్పక్కర్లేదు. వారిద్దరు నిలుచున్న ద్వారం పైకిలేచింది. తాము టెలివిజన్‌లోకి ఎక్కినా గురు పట్టలేనందుకు సంతోషించారు. కాని లోనికి వెళ్ళిన మరుక్షణమే ముందునుంచి ఒక లెన్స్ దూసుకు వచ్చింది. ఇద్దరు క్రింద కూర్చున్నారు చటుక్కున. ఫలితంగా కంట్రోలు రూంలోనున్న వ్యక్తికి వీరు కనిపించకపోవటం, అనుమానం బలపడటం జరిగింది. జరిగేది గ్రహించారు ఇద్దరూ.

వారు ప్రవేశించిన మార్గం సన్నటి నడవాలా వుంది. అంతకుముందు నుంచి విన్పిస్తున్న ఇంజను శబ్దం ఎక్కువయింది.

"మనల్ని గ్రహించారు. వెంటనే ఇక్కణ్నుంచి తప్పుకోవాలి!" అన్నాడు కైలాష్. ఇద్దరూ అలా క్రింద కూర్చునే పాకుతూ పోయారు.

"ఇక్కడంతా ఆటోమాటిక్ సిస్టంలా వుంది. అవతలి వైపు తలుపు బంధిస్తే?" అనుమానంగా అడిగాడు కైలాష్. సాగర్ జవాబివ్వలేదు. అంతకుముందే ఆ అనుమానం అతనికి వచ్చింది.

సైనికుల బూట్లచప్పుడు విన్పిస్తోంది.

గబగబా పాకారు. తలుపు దగ్గరకు చేరుకొన్నారు. బరువుగా ఊపిరి పీలుస్తూ ఉండిపోయారు కొద్దిసేపు.

ఆదే సమయంలో తలుపుదగ్గర చప్పుడయింది. ఇద్దరూ వెల్లకిలా పడుకుని మెషిన్‌గన్స్ తలుపువైపు వుంచి గురిపెట్టారు. తలుపు తెరుచుకుంది.

"ధన్ ధన్ ధన్ ధన్."

మూడు సెకనులు గుళ్ళవర్షం కురిసింది. ఆ నడవా అంతా రీసౌండ్‌తో అదిరిపోయింది. టపటప రాలిపోయారు.

కొంతమంది సైనికులు. మిగిలినవాళ్ళు ప్రక్కకు నక్కారు.

రెండోవైపుకు తిరిగాడు సాగర్. అటునుంచి తలుపు తెరుచుకుని కొంతమంది లోనికి వచ్చారు. సాగర్ చేతిలోని గన్ గర్జించింది. కొంతమంది కూలిపోయారు. చటుక్కున బయటకు పరుగెత్తారు సైనికులు.

తరవాత మరో పదినిముషాలు సైనికులతో దాగుడు మూతలు ఆడారు సాగర్, కైలాష్. కైలాష్ పిక్కలోనికి దూసుకుపోయింది ఒక గుండు. నిప్పుకణిక లోనబెట్టి తిప్పుతున్నంత బాధ.

రెండునిమిషాలసేపు నిశ్శబ్దం. ఇరువైపు తలుపులూ తెరుచుకోలేదు. సాగర్, కైలాష్‌లు తలుపుకు గురిపెట్టి కాల్చారు. రంధ్రాలు పడి, ఎవరిదో ఆర్తనాదం వినిపించింది. ఇవతలివైపు తలుపు తెరుచుకొని ఇద్దరూ జంప్ చేసి నేలమీద పడిపోయారు. మరో ఇద్దరు కూలిపోయారు. ఇప్పుడా చిన్నగదిలో అయిదారుగురి శవాలు తప్ప ఏమీ లేవు. అదొక లిఫ్ట్ అని గ్రహించాడు సాగర్.

మరుక్షణమే లిఫ్ట్ క్రిందకు దిగింది.

"మనల్ని క్రిందకు దింపుతున్నారంటే, క్రింద ఆహ్వానం ఎదురుచూస్తున్నదన్న మాట" అన్నాడు సాగర్. కైలాష్ పళ్ళబిగువులో బాధ భరించి మెషిన్ గన్ అందుకున్నాడు. పిక్కకి రుమాలు కట్టినా రక్తస్రావం ఆగటంలేదు. సాగర్‌కి కైలాష్ బాధ తెలుసు. కాని, విచారించటానికిది తగిన సమయంకాదు. అంతసమయమూ లేదు.

లిఫ్ట్ ఆగింది. తలుపులు తెరిచాడు ప్రక్కనుండి. బయట నుంచి గన్స్ గర్జించాయి. అడుగునుంచే కాల్చారు ఇద్దరూ. రెండు నిమిషాల అనంతరం బయట ఎవరూలేరు. అలారం

హోయ్‌మంటూంది ఇంకా! లిఫ్ట్ బయటకు నడిచి, నడవా వెంట ఉన్న తలుపు తెరిచాడు. పెద్ద హాలు కన్పించింది. లోనికి నడిచి తలుపులు వేశారు.

7

అదొక హాలులాంటి అంతర్భాగం. లైట్లు కాంతితో పట్టపగలులా ఉంది. హాలు ఆ చివర వెడల్పయిన సొరంగ ముఖద్వారం కన్పడుతూ వుంది. ఆ సొరంగం పైభాగాన బలమైన ఇనుప తాడు వుండి, దానికి వెడల్పుగానున్న తొట్టెలాటిది వేలాడుతుంది. ఆ తొట్టెనిండా గనిలోనుంచి తీయబడిన ఖనిజం నింపబడి వుంది. హాలులోవున్న మెషిన్ల ద్వారా ఆ తొట్టె సొరంగ మార్గంగుండా ప్రయాణించి రెండో దీవిని చేరుతూంది. అటువంటి తొట్టెలు ఆ సొరంగంలో ఈజీగా రెండు పడతాయి. అంటె అటునుంచి రావటం ఇటునుంచి పోవడం జరుగుతాయన్న మాట.

అయితే ఆ హాలులోని మెషిన్లన్నీ నిశ్శబ్దంగా వున్నాయి. తొట్టెలో కదలిక లేదు. ఆ హాలులో ఎవ్వరూ లేరు.

అలారం మోత విని అందరూ పోయి వుంటారని గ్రహించాడు సాగర్. అయితే ఆ ఖనిజం ఏమిటో, ఆ తొట్టె ఎక్కడికి వెళుతూందో అతనికి తెలియలేదు. కైలాష్‌ని హెచ్చరించాడు. ఇద్దరూ ముందుకు పరుగెత్తారు. కైలాష్‌ని తొట్టెలోకి ఎక్కించి, మెషిన్ల దగ్గరికి పరుగెత్తి పరిశీలించాడు సాగర్. రెండు నిమిషాల ప్రయత్నం తర్వాత మెషిన్ స్టార్ట్ అయింది. రివ్వున పోయి, తానూ తొట్టె ఎక్కాడు.

సొరంగ మార్గం చీకటిగా వుంది. కనీసం అక్కడక్కడన్నా లైట్లు లేవు. తొట్టె కుదుపులకు కైలాష్, సాగర్లు

ఎగిరెగిరి పడుతున్నారు. రక్తం చాలాపోయింది కైలాష్‌కి. నిస్త్రాణతో కళ్ళు మూసుకున్నాడు.

సాగర్ ఆలోచిస్తున్నాడు. 'ఈ సొరంగం ఎంత దూరం వరకు వుంది? ఈ ఖనిజం యొక్క ఉపయోగ మేమిటి? తమపై దాడిచేసిన విమానాలు, వీరూ ఒకే దేశం అని తెలుస్తోంది. కాని విమానాలు కన్పించలేదు. కాని ఇక్కడి అండర్‌గ్రౌండ్ చూస్తుంటె విమానాలను కూడా అండర్‌గ్రౌండ్‌లో దాచి వుండాలి. అందుకే తమ కళ్ళబడలేదు.'

"సాగర్! ఎన్ని ప్రమాదాలయినా ఎదుర్కొని నువ్వయినా కార్యం పూర్తి చెయ్!"

"కైలాష్" అన్నాడు మందలిస్తున్నట్లు సాగర్.

"అవును. నాకు తెలుసు. సాగర్ నా రక్తం చాలా పోయింది. ఎక్కువసేపు బ్రతకలేను. నీ వెంట వుండి నీకు అడ్డురాలేను. నన్ను వదిలెయ్" ఆ కంఠంలో దీనత్వం లేదు. దేశంకోసం ప్రాణాలిస్తున్నానన్న ఆనందం వుంది.

"డోంట్ బి ఫూలిష్" అన్నాడు సాగర్. "నీ ప్రాణాలకు ఏం భయంలేదు. నిరుత్సాహపడకు."

కైలాష్ బలహీనంగా నవ్విన నవ్వు సాగర్‌కు ఆ చీకట్లో కన్పించలేదు.

కాని కైలాష్ ఏమీ అనలేదు. మౌనంగా కళ్ళు మూసుకున్నాడు. తొట్టె ఉన్నట్టుండి ఆగిపోయింది.

8

"సాగర్! అటు చూడు!" వెనక్కితిరిగి వచ్చినవైపు చూపించాడు కైలాష్. అతని కంఠధ్వనినిబట్టి వెనక్కు తిరిగి చూశాడు సాగర్.

దూరంగా లైట్లు అవుపిస్తున్నాయి. ఎవరో వస్తున్నారు. "వెంటనే ఇక్కణ్నుంచి పారిపోవాలి పద!" ఇద్దరూ క్రిందకు దిగారు. అడుగున గచ్చు నేలలాగా గట్టిగా వుంది. అడుగుతీసి అడుగు వేస్తూంటె చప్పుడవుతూంది.

"నేను వద్దు. నువ్వు తప్పించుకో. వాళ్ళని నేను కవర్ చేస్తాను" అన్నాడు కైలాష్ మెషిన్‌గన్ లైట్ల వైపు గురిపెడుతూ. సాగర్ కదల్లేదు.

"సాగర్! క్విక్! వెళ్ళిపో. వాళ్ళు వచ్చేస్తున్నారు. నా గురించి ఆలోచించకు" అరిచాడు కైలాష్ చిన్నగా. ఇంతలో లైట్ల వైపునుండి కాల్పులు విన్పించాయి. చటుక్కున బోర్లా పడిపోయా రిద్దరు.

"సాగర్! క్విక్! గో ఎవే!" ఒత్తిడి చేశాడు కైలాష్. అతని కంఠంలో బలంలేదు. నీరసంగా వుంది.

కైలాష్‌ది మొండిపట్టు అని తెలుసు సాగర్‌కి.

ఇంతలో సొరంగం రెండో వైపు లైట్లు, చప్పుళ్ళు కన్పించాయి. ఉలిక్కిపడ్డా రిద్దరు.

"ఆల్ రైట్! నేను వెళుతున్నాను!" చివరిసారిగా కైలాష్ చేతిని నొక్కి సొరంగం రెండో వైపుకు పరుగు తీశాడు సాగర్. అతని బూట్లచప్పుడు సొరంగంలో ప్రతిధ్వనిస్తోంది.

వెనకనుంచి కాల్పులు మొదలయ్యాయి. సొరంగం కూలిపోతుందేమోనన్నంత శబ్దం. కైలాష్ ఇటునుంచి కాలుస్తున్నాడు. ఎదురుగా లైట్లు కన్పిస్తున్నాయి. పరుగెత్తుతూనే కాల్చాడు. నిమిషం తర్వాత చీకటి అలుముకుంది. ఆగిపోయాడు సాగర్.

అక్కడ సొరంగం వంకర తిరిగింది. ముందుకుకూడా ఉంది. తొలైట్ట మొదట వంకర తిరిగినచోటు ఆగిపోగానే,

దానినక్కడ ఖాళీ చేస్తారు. అది హాలులోనుంచి తిరిగి సారంగంకు ఎదురుగానున్న మార్గంలోనుంచి తిరిగి సారంగం లోకి ప్రవేశిస్తుంది.

వంకర తిరిగిన గోడకు ఆనుకొని తల తొంగిచూశాడు. ధన్ మన్నాయి గన్స్. తల వెనక్కి లాక్కోకపోతే బద్దలైపోయేది. తను గురించి వేట పెద్ద ఎత్తులోనే సాగుతోందని తీర్మానించుకున్నాడు. వెనకనుంచి చప్పుళ్ళు వినిపిస్తున్నాయి యింకా. సారంగం అంతమయిన హాలు కూడా అంతకుముందు చూసిన హాలుమాదిరే ఉంది. ఇక్కడ మిషన్లుమాత్రం లేవు. హాలు అంతా ఖనిజంతో నిండిపోయి ఉంది. ఆ ఖనిజంమీద నిలబడి గన్స్ పేలుస్తున్నారు ఐదుగురు సిపాయిలు.

సాగర్ బోర్లా పడుకున్నాడు. గన్ని మాత్రం బయట పెట్టి, సైనికులున్నవైపు గుర్తుంది కనుక ట్రిగ్గర్ నొక్కాడు. ఆర్తనాదాలు వినిపించాయి. ఒకగుండు వచ్చి ముంజేతి మణికట్టులో దిగబడింది. వెనక్కి లాక్కున్నాడు చేతిని. మెషిన్ గన్ గుళ్ళకి సారంగం గోడ పెచ్చులూడిపోయింది. నెమ్మదిగా తల బయటపెట్టి చూశాడు. ఐదుగురు పడిపోయి ఉన్నారు. లోనికి అడుగుపెట్టాడు.

9

అదేసమయంలో సారంగంలో చప్పుళ్లు ఆగిపోయాయి. హాలులోఉన్న ఖనిజపు కుప్పలను దాటుకుంటూ ముందుకు నడిచాడు సాగర్. హాలు చివర ఒకగది ఉంది. చూస్తేనే ఆదొక లిఫ్ట్ అని తెలుస్తోంది. దానిలోనికి ప్రవేశించి స్విచ్ నొక్కాడు.

సారంగంలో ఈ పాటికి కైలాష్ చనిపోయి ఉంటాడు. సైనికులు అతన్ని కనుగొని, తాను ఏమయ్యాడో అర్థం

గాక తప్పదంటారు. కనీసం ఐదునిమిషాలైనా తనకు సమయం చిక్కుతుంది. ఈలోపునే తాను తన పని ముగించేయాలి. తాను చనిపోవటం ఖాయం. తమవద్దనున్న సమస్తం, ఆయుధాలు, బాంబులు లాక్కున్నారు. తన దగ్గర ప్రస్తుతం ఈ మెషిన్‌గన్ తప్ప మరో ఆయుధం లేదు. దీనిలోనైనా అమ్యూనిషన్ ఐపోవచ్చింది.

లిఫ్ట్ ఆగింది. తలుపు తెరిచి బయటకు తొంగిచూశాడు. ఎవరూ కన్పించలేదు. నడవా చివర ఒక తలుపు ఉంది. తలుపుపైన ఎర్రటి బల్బు వెలుగుతూంది. ప్రక్కనే గోడ మీద స్విచ్ కనిపిస్తూంది. బటన్ నొక్కాడు. తలుపు నిశ్శబ్దంగా పైకిపోయింది. లోనికి రాగానే మూసుకు పోయింది.

అక్కడి దృశ్యం అతణ్ని విభ్రాంతుణ్ని చేసింది. చాలా పెద్దగుహ అది. ఫ్లష్‌లైట్ల కాంతిలో పట్టపగలులా మెరిసిపోతూంది. చిన్నచిన్న విమానాలు తయారీలో ఉన్నాయి. తమపై దాడిచేసినవి అటువంటి విమానాలేనని గుర్తించగానే సాగర్ ఆవేశపూరితుడయ్యాడు. ఇదంతా చూస్తుంటే మరో ప్రపంచయుద్ధానికి నాంది పలుకు తున్నట్లే ఉంది.

ఆ పెద్దగుహలో ఎవరూ లేరు. నిర్జనంగా, నిశ్శబ్దంగా ఉంది. అదే సమయంలో గుహ పైభాగం పెద్ద శబ్దంతో రెండుగా విడిపోవ నారంభించింది.

చటుక్కున ప్రక్కనేవున్న ఒక ఖాళీ డ్రమ్ము ప్రక్కకురికి గమనించసాగాడు సాగర్.

రెండునిమిషాల తర్వాత తలుపులు తెరుచుకున్నాయి పూర్తిగా. బయట ఎర్రటి ఆకాశం కన్పిస్తోంది. టైం చూసుకోవటానికి సాగర్ దగ్గర వాచీ లేదు. సుమారుగా

సాయంత్రం అయిదున్నర, ఆరు అయ్యింటుంది.

తలుపులు తెరుచుకున్నాక పైనుంచి ఒక హెలికాప్టర్ దిగింది నెమ్మదిగా. తలుపులు మూసుకుపోయాయి మామూలుగా. హెలికాప్టర్ నుంచి ఒక ఆజానుబాహుడు దిగాడు పూర్తిగా మిలటరీదుస్తుల్లో ఉండి. అతనూ 'కైనా' దేశం వాడే ననటంలో ఎట్టి సందేహం లేదు.

ఈ ఆపరేషన్‌కు లీడర్ అని అర్థం అయింది సాగర్‌కి. బహుశా తమ విషయం అతనికి తెలిపివుంటారని భావించాడు సాగర్. కాని లీడర్ తనవైపే రావటం గుర్తించి అదిరిపోయాడు. అతడు తనని గమనించాడా?

లీడర్, సాగర్‌ని చూడలేదు. హాలు చివరకు నడిచి ప్రక్కనే గోడదగ్గరున్న ఒక స్విచ్ నొక్కాడు. మరు క్షణమే నేలమీద దిగటానికి అనువుగా మెట్లు కన్పించాయి, చిన్నపలక తొలిగిన తర్వాత లీడర్ వాటివెంట నడిచాడు.

సాగర్ హెలికాప్టర్‌వైపు చూశాడు. పైలట్ దిగి ఎటో వెళ్తున్నాడు. పలక మూసుకుపోయింది. రెండు నిమిషాలు ఆగి, తానూ తలుపు తెర్చుకొని లోనకు ప్రవేశించాడు. అక్కడ పొడుగ్గానున్న నడవా దాటింతర్వాత ఒక తలుపు కన్పించింది. లోనికి పోయాడు. లోపల మరో హాలు కన్పించింది. రియాక్టర్‌లవంటివి నిర్మితమై వున్నాయి. కొంతమంది మనుషులు పనిచేస్తున్నారు. వారికి కనపడకుండా ఒక స్తంభం చాటున నక్కి, లీడర్‌కోసం వెదికాడు. లీడర్ హాలుకి ఒకప్రక్కగా ఉన్న తలుపు తెర్చుకొని లోనికి వెళ్ళటం కన్పించింది.

సంశయంలో పడ్డాడు సాగర్. అతని వెంటే వెళ్ళటమా లేక ఈ రియాక్టర్‌లని నాశనం చేయటమా?

హాలునంతటినీ పరిశీలించాడు. దూరంగా ఎక్స్‌ప్లోజివ్స్ అన్న అక్షరాలు కన్పించడంతోనే అతని కళ్ళు మెరిశాయి. కాని అంతలోనే చప్పబడిపోయాడు. వాటి దగ్గరకు వెళ్ళాలంటే రియాక్టర్‌ని, అంతమంది మనుషుల్ని దాటుకుంటూ వెళ్ళాలి.

తళుక్కున ఒక ఆలోచన మెరిసింది సాగర్‌కు. అంతకు ముందు విమానాలు తయారుచేసే హాలులో పెట్రోలు డబ్బాలు చూశాడు తను. వాటిని ఇప్పుడు ఉపయోగించుకోవాలి. తిరిగి వెనక్కు నడిచాడు సాగర్.

* * *

మర్నాడు పోర్ట్ బ్లెయిర్‌లో నున్న భారతీయ ఏజంటు ప్రభుత్వానికి పంపిన సమాచారంలో ఇలా ఉంది.

"భారత కాలమానం ప్రకారం క్రిందటిరోజు సాయంత్రం ఏడు గంటలకు అండమాన్ సమీపంలో పోర్ట్ బ్లెయిర్‌కు దగ్గరగానున్న ఒక దీవిలో పెద్ద పెద్ద ప్రేలుళ్ళు కలిగాయి. ఆకాశం అంతా ఆ వెలుగులో ప్రతిఫలించింది. తుత్తినియలయిన ఇనుప భాగాలు, మండుతున్న ఇనుప వస్తువులు ఎగిరి రెండు మైళ్ళవరకూ వచ్చిపడ్డాయి. ఈ దృశ్యాన్ని చాలామంది చూశారు.

సమీపంలో సంచరించే నౌకలు ఏమీ లేకపోవటంవల్ల ప్రాణనష్టం జరగలేదు. కాని దీవి అంతా నాశనం ఐంది. ఆ దీవిలో ఎలా ఈ ప్రేలుళ్ళు సంభవించాయో ఎవరికీ తెలీలేదు. ప్రక్కనేవున్న మరొక దీవికూడా ప్రేలుళ్ళతో నిండిపోయింది. దాదాపు ఐదారు గంటలవరకు ప్రేలుళ్ళు వినవస్తూనే వున్నాయి. తెల్లవారుఝామునకూడా మంటలు ఆరిపోలేదు."

—: ఐపోయింది :—